ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

5
జయశంకర్
భూపాలపల్లి
ములుగు
బుధవారం 7 ఆగస్టు 2024



'ఉపాధి'పై అనుమానాలు!

MAHATMA GANDHI NATIONAL RURAL EMPLOYMENT GUARANTEE SCHEME

లక్ష్యాలకు మించి..



మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద గ్రామీణ ప్రాంత ప్రజలకు పని దినాలు కల్పించే విషయంలో జనగామ జిల్లా రాష్ట్రంలోనే ఆరోస్థానంలో నిలవగా మహబూబాబాద్ జిల్లా అట్టడుగున 31వ స్థానంలో ఉంది. జనగామ జిల్లాలో 2022-23 సంవత్సరంలో 24.8లక్షల పనిదినాలను కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించగా దానిని మించి 30.5 లక్షల పని దినాలను (123శాతం) పని దినాలను కల్పించి రాష్ట్రంలో ఆరో స్థానంలో నిలిచింది. వరంగల్ జిల్లాలో 17.5 లక్షల పని దినాలను కల్పన లక్ష్యంకాగా అంతకు మించి 20.3 లక్షల (116 శాతం) కల్పించి రాష్ట్ర స్థాయిలో 15వ స్థానంలో నిలిచింది. హనుమకొండ జిల్లా పనిదినాల లక్ష్యం 19.3లక్షలు కాగా 21.9లక్షల పని దినాలు (114 శాతం) కల్పించడంతో 17వ స్థానం, ములుగు జిల్లాలో 12.1లక్షల పని దినాలు లక్ష్యం కాగా 13.4లక్షల పని దినాలు (111 శాతం) కల్పించడంతో 24వ స్థానంలో నిలిచింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా 19.9లక్షల పనిదినాలను కల్పించాలన్నది లక్ష్యం కాగా 21.2లక్షల పని దినాలతో (106 శాతం) 29వస్థానంలో మహబూబాబాద్ జిల్లా 53.3లక్షల పని దినాలు లక్ష్యం కాగా 55.9 (105 శాతం) పని దినాలతో రాష్ట్ర స్థాయిలో అట్టడుగున 31వ స్థానంలో నిలిచింది.

- లక్ష్యాన్ని మించి పనులు కల్పించడం పట్ల సందేహాలు
- తనిఖీలకు ప్రత్యేక కేంద్ర బృందాల ఏర్పాటు
- త్వరలో క్షేత్రస్థాయి పరిశీలనకు ఉమ్మడి జిల్లాకు రాక
- రికార్డులను సిద్ధం చేస్తున్న డీఆర్‌డీవో అధికారులు

హనుమకొండ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం తీరుతెన్నులపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా అధికారులు రికార్డుల్లో చూపిన మేరకు వాస్తవంగానే ఉపాధి పనులు జరిగాయా? హాజరైన కూలీల సంఖ్య సక్రమంగానే ఉందా? అనే సందేహాలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ అనుమానాలకు చెక్‌పెట్టేలా కేంద్రం క్షేత్రస్థాయిలో విస్తృత తనిఖీలకు శ్రీకారం చుడుతోంది. ఇందుకోసం కేంద్ర బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించి రికార్డులో చూపిన మేరకు ఉపాధి లెక్కలు సక్రమంగా ఉన్నాయా? ఏవైనా అవకతవకలు ఉన్నాయా? అంశాలపై నిగ్గుతేల్చనున్నాయి. ఇందులో భాగంగా ఆ బృందంలోని అధికారులు సంబంధిత రికార్డులను పరిశీలించడంతో పాటు అవసరమైతే కూలీలతో నేరుగా మాట్లాడతారు. త్వరలోనే కేంద్ర బృందాలు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో కూడా పర్యటించనున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాల గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు రికార్డులను సిద్ధం చేస్తున్నారు.

గణాంకాల పెరుగుదలతో అనుమానాలు

జాతీయ ఉపాధి హామీ పథకంలో గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలోని 18 జిల్లాల్లో కూలీల సంఖ్య, పనిదినాలు 150శాతానికి పైగా పెరిగినట్టు గణాంకాలు వెలుగు చూడడంతో పనుల కల్పన, కూలీల హాజరుపై కేంద్ర ప్రభుత్వానికి అనుమానం కలిగింది. క్షేత్ర స్థాయిలో పనులను పరిశీలించి నిగ్గుతేల్చాలని నిర్ణయించింది. ఈ మేరకు పనులను పరిశీలించడానికి కేంద్ర బృందాలను పంపుతోంది. పని దినాల కల్పన విషయంలో కేంద్రానికి అనుమానం కలిగిన రాష్ట్రంలోని 18 జిల్లాల్లో ఉమ్మడి వరంగల్‌లోని ఆరు జిల్లాలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఆరు జిల్లాల్లో పనులు, కూలీలకు సంబంధించిన రికార్డులు సిద్ధం చేయాలని పంచాయతీరాజ్ శాఖ కలెక్టర్లను ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వం 2022-23 సంవత్సరంలో జరిగిన పని దినాలతో 2023-24 సంవత్సరంలో జరిగిన పనిదినాలను పోల్చి చూసింది. 2022-23లో ఉపాధి పని దినాలు 2023-24 కన్నా తక్కువగా ఉండడంతో అనుమానం పడుతోంది. ఇటీవల అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా సభకు రాష్ట ప్రభుత్వం సమర్పించిన 2024 సామాజిక, ఆర్థిక సర్వే రిపోర్టులో కూడా రాష్ట్రంలో 18 జిల్లాల్లో లక్ష్యానికి మించి పని దినాలు కల్పించినట్టు పేర్కొన్నది.

రికార్డులను సిద్ధం చేస్తున్న అధికారులు

కూలీల పని దినాలు పెరగడానికి నిర్దిష్టమైన కారణాల అన్వేషణ కోసం కేంద్ర బృందాలు ఈనెలలోనే తనిఖీలకు రానున్నాయి. ఈ క్రమంలో అధికారులు ఉపాధి పనులకు సంబంధించిన రికార్డులు సరి చూసుకుంటున్నారు. గ్రామ సభ తీర్మానం, ఎన్‌వోసీ పత్రం, పనుల ప్రదేశాల్లో బోర్డులు, చేసిన వ్యయం, ఎంత మందికి పని కల్పించామనే వివరాలు, పని ప్రారంభానికి ముందు, ఆ తర్వాత ఫొటోలు సేకరిస్తున్నారు. కేంద్ర

మిగతా 8వ పేజీలో..

వర్షాలు తక్కువ పడడం వల్లే పనులు పెరిగాయి

- కె.నాగ పద్మజ, డీఆర్‌డీవో గ్రామీణాభివృద్ధి శాఖ, హనుమకొండ జిల్లా



2022-23 సంవత్సరంలో కన్నా 2023-24లో వర్షాలు తక్కువ పడ్డాయి. చాలినన్ని వర్షాలు పడకపోవడంతో చెరువులు, కుంటలు, బావులు ఎండిపోయాయి. దీంతో సహజంగానే గ్రామాల్లో వ్యవసాయ పనులు మందగించాయి. కూలీలకు వ్యవసాయ పనులు దొరకని పరిస్థితి ఏర్పడింది. దీంతో కూలీలంతా ఉపాధి హామీ పనులవైపు మళ్లారు. పైగా కేంద్ర ప్రభుత్వం కూడా ఉపాధి హామీ పథకం కింద ప్రతీ గ్రామ పంచాయతీలో గరిష్ఠంగా 25 మంది కూలీలకు పని కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించింది. ఆ మేరకు కూలీలను సమీకరించాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. అదే లక్ష్యం ప్రకారం ఉపాధి పనులను చేయించాం. దీంతో సహజంగానే 2023-24 సంవత్సరంలో పని దినాలు పెరిగాయి. అంతేకాకుండా ఎన్‌ఆర్‌ఎం పనులు కూడా ఈ సారి ఎక్కువ చేశారు. దీనికితోడు వ్యవసాయాధారిత పనులు చేపట్టాము. ఈ కారణాలను ప్రభుత్వానికి రాసి పంపాము.

జయశంకర్‌కు ఘన నివాళి



జయశంకర్ చిత్రపటం వద్దనివాళులర్పిస్తున్న భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ



ములుగు కలెక్టరేట్‌లో జయశంకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ దివాకర

భూపాలపల్లి కలెక్టరేట్/ములుగు కలెక్టరేట్, ఆగస్టు 6 :తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమ సేనాని ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలు భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో మంగళవారం ఘనంగా జరిగాయి. భూపాలపల్లి కలెక్టరేట్‌లో కలెక్టరేట్‌లో ఆ జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ములుగులో కలెక్టర్ దివాకర ఆధ్వర్యంలో నిర్వహించారు. జయశంకర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. భూపాలపల్లిలో అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, పలు శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, ములుగులో అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, సి.హెచ్.మహేందర్‌జీ, డీపీఆర్‌వో రఫిక్, డీఏవో విజయచంద్ర, కలెక్టరేట్ ఏవో రాజ్‌కుమార్, సూపరింటెండెంట్ మహేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రూ.15వేలకు ఆడశిశువు విక్రయం

- ఏటూరునాగారం వాసికి అమ్ముకున్న చర్ల దంపతులు
- పేగుబంధం గుర్తొచ్చి మనసుమార్చుకున్న వైనం
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు.. ఆలస్యంగా వెలుగులోకి

ఏటూరునాగారం రూరల్, ఆగస్టు 6: పుట్టిన వారంలోనే ఆడశిశువు విక్రయించిన తల్లిదండ్రులు రెండునెలల తర్వాత కడుపుతీపి గుర్తుకొచ్చి మనసుమార్చుకున్నారు. కొనుగోలు చేసిన వ్యక్తి తిరిగి ఇచ్చేందుకు నిరాకరించడంతో పోలీసులను ఆశ్రయించారు. ఈ ఘటన ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం కలివేలు గ్రామానికి చెందిన దంపతులకు ఇద్దరు కుమార్తెలున్నారు. మూడోసారి గర్భందాల్చిన భార్యను కాన్పు కోసం ఆమె భర్త జూన్ 5న ఏటూరునాగారంలోని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తీసుకొచ్చాడు. అదేరోజు వైద్యులు ఆమెకు సాధారణ ప్రసవం చేయగా ఆడశిశువుకు జన్మనిచ్చింది. అప్పటికే ఇద్దరు కూతుళ్లు ఉండటంతో పోషణను భారంగా భావించిన ఆ భర్త ఆస్పత్రి చుట్టుపక్కల వారికి తన శిశువును విక్రయిస్తానని చెప్పాడు. జూన్ 7న ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయి స్వగ్రామమైన చర్లకు దంపతులు ఇద్దరు వెళ్లిపోయారు. ఈ క్రమంలో ఏటూరునాగారానికి చెందిన సంతానం లేని ఓ వ్యక్తి మధ్యవర్తి ద్వారా చర్లకు వెళ్లాడు. రూ.15వేలు చెల్లించి పాపను తీసుకొచ్చాడు. ఈక్రమంలో బిడ్డపై మమకారం చంపుకోలేకపోయిన ఆ తల్లి.. తన కూతురు తనకు కావాలని భర్తపై ఒత్తిడి తేవడంతో మంగళవారం వారు ఏటూరునాగారం వచ్చారు. పాపను తమకు ఇవ్వాలని కోరగా కొనుగోలు చేసిన వ్యక్తి ఒప్పుకోలేదు. దీంతో ఆ దంపతులు స్థానిక పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదు స్వీకరించిన ఎస్సై దర్యాప్తు చేస్తున్నారు.

మాతాశిశు సంరక్షణ శాఖ అధికారుల సమక్షంలో బుధవారం శిశువును కన్నవారికి అప్పగించనున్నట్టు సమాచారం. దీనిపై ఎస్సై తాజొద్దీన్‌ను సంప్రదించగా శిశువు విక్రయానికి సంబంధించి ఫిర్యాదు వచ్చిందని, దర్యాప్తు తర్వాత పూర్తి వివరాలను వెల్లడిస్తామని చెప్పారు.

గద్దర్ ఆశయాలు సాధించాలి

వర్ధంతి సభలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



గద్దర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తదితరులు

భూపాలపల్లిటౌన్, ఆగస్టు 6: పీడిత ప్రజల గొంతుక గద్దర్ అని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఉద్యమాల గడ్డ భూపాలపల్లిలో గద్దర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజా యుద్ధనౌక గద్దర్ ప్రథమ వర్ధంతి సభ భూపాలపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం జరిగింది. ముందుగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆతర్వాత అంబేద్కర్ చౌరస్తా చేరుకున్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడే తెలంగాణ అమరవీరుల స్థూపానికి పూలమాల వేశారు. అక్కడి నుంచి ప్రధాన రహదారి మీదుగా ఫంక్షన్‌హాల్ వరకు జరిగిన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గద్దర్ సంస్మరణ సభకు నిర్వహణ కమిటీ నాయకుడు, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి అజ్మీరా జంపయ్య అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కత్తుల వంతెన మీద కవాతు చేసిన గద్దర్ పీడిత ప్రజల విముక్తి కోసం ఎన్నో పాటలు రాసి ప్రాణం పోశారని కొనియాడారు. ప్రజల గొంతుకై ఆయన స్థిర స్థాయిలో నిలిచారన్నారు. ప్రజా ఉద్యమాల్లో సాంస్కృతిక విప్లవాన్ని సృష్టించారని పేర్కొన్నారు. విప్లవోద్యమం, దళితోద్యమం, మలిదశ తెలంగాణ ఉద్యమంలో అగ్ని గళాన్ని వినిపించారని అన్నారు. త్యాగానికి, పోరాటానికి నిలువెత్తు రూపం గద్దర్ అని కొనియాడారు. పీడిత, తాడిత ప్రజల కోసం అనునిత్యం పనిచేసిన ఆయన్ను స్మరించుకోవడం మనందరి కర్తవ్యమని అన్నారు.

సాంస్కృతికోద్యమాన్ని బతికించుకుందాం..

సాంస్కృతికోద్యమాన్ని బతికించుకునేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్ అన్నారు. గద్దర్ ఆశయాలకు అనుగుణంగా పనిచేయడం వల్ల అది సాధ్యమవుతుందని అన్నారు. ప్రభుత్వానికి అండగా ఉంటూనే, గద్దర్ కోరుకున్న ప్రజాస్వామిక తెలంగాణ కోసం అహర్నిశలు పాటుపడాలన్నారు. రాజ్యాంగానికి రక్షణ అవసరం అని, ప్రజల హక్కుల కోసం, అణచివేతకు వ్యతిరేకంగా పనిచేయాలని అన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, తెలంగాణ ఉద్యమ నేత ముద్దమల్ల భార్గవ్ మాట్లాడుతూ సమాజం పట్ల అవగాహన పెంచుకుంటేనే నిజమైన చైతన్యం వస్తుందన్నారు. భూపాలపల్లిలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాల్సి ఉందని అన్నారు. ఈ సమావేశంలో వివిధ నక్సల్ పార్టీల మాజీ నాయకులు చార్వాక, ప్రసాద్, వనజ, వెంకన్న, శ్రీరాములు, పుష్ప, ప్రజా సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు పంతగాని సమ్మయ్య, పైడిపల్లి రమేష్, తిరుపతి, కోల శ్యాం, కామెర గట్టయ్య, రవీందర్, బి.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరాలయంలో టెండర్లు

మహదేవపూర్, ఆగస్టు 6 : మండలంలోని ప్రముఖ శ్రీ కాళేశ్వర ముక్తీశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో వివిధ వ్యాపారాల నిర్వహణకు మంగళవారం టెండర్లు నిర్వహించారు. మొత్తం 11 టెండర్లు నిర్వహించగా ఆరు ఖరారయ్యాయని ఆలయ ఈవో మారుతి తెలిపారు. వీటిపై గత సంవత్సరం రూ. 56, 26,116 రాగా ఈసారి రూ. 62,77,350 వచ్చాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారి అనిల్‌కుమార్, ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడాలి

విరివిగా మొక్కలు నాటాలి
రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రి ధనసరి సీతక్క



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

గోవిందరావుపేట, ఆగస్టు 6: విరివిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపడాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండలంలోని చల్వాయి గ్రామంలోని బుస్సాపూర్ రోడ్డులో ఉన్న పోలీస్ ఐదో బెటాలియన్ క్యాంపు ఆవరణలో ఆమె మంగళవారం జిల్లా ఇన్‌చార్జి అధికారి ఎస్.కృష్ణ ఆదిత్య, కలెక్టర్ టి.ఎస్.దివాకర తదితర అధికారులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో విజేతలైన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ చెట్లను పెంచకపోవడం, ఉన్న వాటిని నరికివేయడం వల్ల వాతావరణ సమతుల్యాన్ని కాపాడడంలో విఫలమవుతున్నామన్నారు. పచ్చదనాన్ని కాపాడాల్సిన అవసరం అందరిపై ఉందని అన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో విద్యార్థులు, యువత పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. పండ్ల మొక్కలతోపాటు పూలమొక్కలను పెంచాలని సూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని నిరంతర ప్రక్రియగా అలవాటు చేసుకోవాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే అత్యంత ఎక్కువ అటవీ విస్తీర్ణాన్ని కలిగి ఉన్న జిల్లా ములుగు అన్నారు. జిల్లాలో 100 కిలోమీటర్ల మేర గోదావరినది పరవళ్లు, ఎక్కువ మంది పర్యాటకులను ఆకర్షించే పర్యాటక ప్రాంతాలకు ములుగు జిల్లా కేంద్ర బిందువుగా ఉందని మంత్రి అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని చెరువులు, కుంటల పరిసర ప్రాంతాల్లో చెట్ల పెంపకం ప్రణాళికాబద్ధంగా జరిగేలా చూడాలని జిల్లా అటవీశాఖ అధికారి రాహుల్ కిషన్‌జాదవ్‌ను ఆదేశించారు. జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణఆదిత్య మాట్లాడుతూ స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో మొక్కలు నాటడంతోపాటు వాటిని సంరక్షించాలన్నారు. మొక్కలను కాపాడే బాధ్యత అధికారులదే అఅంఅన్నారు. మొక్కలు ఎక్కువగా ఉన్నచోట సమృద్ధి అయిన వర్షపాతం నమోదవుతుందని, వ్యవసాయానికి అనుకూలంగా ఉంటుందని పేర్కొన్నారు. దాంతోపాటు నివసించే ప్రదేశాలను పరిశుభ్రంగా చూసుకుంటే ప్రజలు ఎలాంటి అనారోగ్యాలకు గురికారని అన్నారు. కలెక్టర్ దివాకర మాట్లాడుతూ స్వచ్ఛదనం-పచ్చదనం పాటిస్తే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.శ్రీజ, ఓఎస్డీ గీతేమహేష్ బాబాసాహెబ్, డీఎఫ్‌వో రాహుల్ కిషన్‌జాదవ్, సీఎంటీ టి.అలెక్, డీఎస్పీ రవీందర్, మండల ప్రత్యేక అధికారి విజయచంద్ర, వివిధశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పరిశుభ్రతకు నిధులు

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా గ్రాంటు
అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు బాధ్యతలు

వెంకటాపూర్(రామప్ప), ఆగస్టు 6: ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఈ మేరకు విద్యా శాఖ ద్వారా రెండు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. పరిశుభ్రత బాధ్యతలను అప్పగిస్తూ సర్కారు నిర్ణయం తీసుకుంది. దీనిపై టీచర్లు, విద్యాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బడుల్లో మరుగుదొడ్ల శుభ్రత, మొక్కలకు నీరు పోయడం, పాఠశాల ఆవరణ శుభ్రంగా ఉంచేందుకు ఈ నిధులు ఉపయోగించుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

నిధుల కేటాయింపు ఇలా..

ములుగు జిల్లాలో మొత్తం 353 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ప్రాథమిక పాఠశాలలు 268, అప్పర్ ప్రైమరీ పాఠశాలలు 45, ఉన్నత పాఠశాలలు 40 ఉన్నాయి. అందులో 30 మందిలోపు విద్యార్థులున్న పాఠశాలలకు సర్కారు రూ.3వేలు గ్రాంటుగా ఇవ్వనుంది. 31 నుంచి 100 మంది ఉన్న పాఠశాలలకు రూ.6వేలు, 101 నుంచి 250 మంది ఉంటే రూ.8 వేలు, 251 నుంచి 500 మంది ఉంటే రూ.12వేలు, 501 నుంచి 750 మంది ఉంటే రూ.15 వేలు, 750 మందికిపైగా ఉంటే రూ.20వేలు ఇస్తుంది. మొత్తం 10 నెలలకుగాను ఒకేసారి నిధులు విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

- ఏళ్ల మధుసూదన్, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి



పాఠశాలల్లో పరిశుభ్రతకు నిధులు విడుదల చేస్తూ నిర్ణయం తీసుకోవడం హర్షణీయం. ఐదేళ్లుగా గ్రామపంచామతీ సిబ్బందికి పాఠశాలల్లో పరిశుభ్రత బాధ్యతలు అప్పగించడంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. అమ్మ ఆదర్శ కమిటీలకు అప్పగించడం వల్ల పాఠశాలల్లో ఇక అపరిశుభ్రత అనే సమస్య ఉండబోదు.

రామప్ప పరిసరాల్లో విద్యుత్ వెలుగులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



రామప్ప పరిసర ప్రాంతాల్లోని తూర్పురోడ్డులో లైట్లను ఏర్పాటు చేయిస్తున్న తహసీల్దార్, పంచాయతీ కార్యదర్శి

వెంకటాపూర్(రామప్ప), ఆగస్టు 6: రామప్ప ప్రధాన రహదారి వెంట సుదీర్ఘకా లం తర్వాత విద్యుత్ వెలుగులు దర్శనమిచ్చాయి. 'అంధకారంలో రామప్ప' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ఇటీవల కథనం ప్రచురితమైన నేపథ్యంలో దేవాలయ పరిసర ప్రాంతాల్లోని తూర్పు రోడ్డులో 40 విద్యుద్దీపాలను మంగళవారం ఏర్పాటు చేశారు. తహసీల్దార్ సదానందం, గ్రామ పంచాయతీ కార్యదర్శి పోతరాజు రేవతి పర్యవేక్షణలో ఈ పనులు జరిగాయి.

పకడ్బందీగా 'స్వచ్ఛదనం-పచ్చదనం'

జిల్లా ఇన్‌చార్జ్ అధికారి కృష్ణ ఆదిత్య

ములుగు కలెక్టరేట్, ఆగస్టు 6: పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా నిర్వహిస్తోందని జిల్లా ఇన్‌చార్జి అధికారి ఎస్.కృష్ణఆదిత్య అన్నారు. మంగళవారం ఆయన కలెక్టరేట్ సమావేశపుహాల్ కలెక్టర్ టీఎస్.దివాకర, భూపా లపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మలతో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా ఉండా లంటే పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, సమర్థంగా పారిశుధ్య నిర్వహణ ద్వారా ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందని అన్నారు. మానవాళికి చెట్లు ఎంతో అవసరమని, గ్రామాలు, అటవీ ప్రాం తాలు పచ్చదనంతో కళకళలాడాలే మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో రోజూ ప్రభుత్వ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశా లల్లో విద్యార్థుల సంఖ్యను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎంత మంది రోగులను పరీక్షిస్తున్నారనే విషయాన్ని సైతం ఆన్‌లైన్‌లో రోజూ నమోదు చేయాలని ఆదేశించారు. ప్రతి ప్రభుత్వ ఆస్పత్రిలో రోగనిర్ధారణ చేసే సీపీపీ పరీక్ష కిట్ ఉండేలా చర్యలు తీసుకో వాలని, గర్భిణుల విషయంలో ముందస్తు ప్రణాళిక చేసుకోవాలని అన్నారు. డయేరియా, డెంగీ, చికున్‌గున్యా వివరాలను ఎప్పటికప్పుడు తెలపాలని సూచించారు. ఈ సమావేశంలో ములుగు అదనపు కలెక్టర్ పి.శ్రీజ, భూపాలపల్లి అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా, ములుగు డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్, ములుగు, భూపాలపల్లి జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

సీపీఆర్‌తో మనిషికి పునర్జన్మ

డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య

ములుగు రూరల్ ఆగస్టు 6: హృద్రోగంతో అస్వస్థతకు గురై ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి సీపీఆర్ ప్రక్రియ పునర్జన్మ అందించే సాధనమని డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్య అన్నారు. ములుగు మండలం రాయినిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాడే కార్యక్రమంలో భాగంగా సీపీఆర్ ప్రక్రియపై వైద్య సిబ్బందికి మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఆర్ ఎలా చేయాలో ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. గుండెపోటు వచ్చిన సమయంలో సీపీఆర్ చేసి మనిషి ప్రాణాలను కాపాడొచ్చన్నారు. ప్రాథమికంగా చేసే ఈ ప్రక్రియ వల్ల మనిషిని దవాఖానాకు తీసుకెళ్లేలోగా ప్రాణాలను రక్షించవచ్చన్నారు. అనంతరం తల్లిపాలవారోత్సవాల ప్రాముఖ్యతను వివరించారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి ప్రసాద్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కుక్క కాటుతో వృద్ధుడికి గాయాలు

మొగుళ్లపల్లి, ఆగస్టు 6: కుక్కకాటుతో ఓ వృద్ధుడు గాయపడిన సంఘటన మండల కేంద్రంలో మంగళవారం రాత్రి జరిగింది. మండల రంపీస వీరన్న కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి ముందు కూర్చున్నాడు. ఈక్రమంలో వీధిలో ఉండే పిచ్చికుక్క ఒక్కసారిగా దాడిచేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు అతడిని చిట్యాల సివిల్ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన డాక్టర్లు మెరుగైన వైద్యం కోసం భూపాలపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి

బీసీ నేత జక్కని సంజయ్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న జక్కని సంజయ్ కుమార్

హనుమకొండ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోటా అమలు కోసం ఈనెల 10వ తేదీన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్టు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కని సంజయ్ కుమార్ తెలిపారు. మంగళవారం హనుమకొండలోని ఒక హోటల్‌లో బీసీ రాజకీయ పోరాట సమితి యువజన విభాగం ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంజయ్ కుమార్ మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం వాటా అమలుకు అన్ని బీసీ సంఘాలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలతో నిర్వహిస్తున్న ఈ సమావేశాన్ని బీసీలు విజయవంతం చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ జాతీయ నాయకుడు రాహుల్‌గాంధీ బీసీల కోసం పోరాటం చేస్తున్నారని, ఎన్నికల మేనిఫెస్టోలో బీసీ డిక్లరేషన్ ప్రకటించినందుననే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైందని, కనుక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీ డిక్లరేషన్‌ను తప్పక అమలుచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ రాజకీయ పోరాట సమితి యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి పంజల రేవంత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో బీసీ నాయకులు తిరుపతి, బొంగోని అభిలాష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

మేడిగడ్డకు కొనసాగుతున్న వరద

మహదేవపూర్ రూరల్, ఆగస్టు 6: కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధానమైన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రభావం కొనసాగుతోంది. మంగళవారం ఇన్‌ఫ్లో 3.62లక్షల క్యూసెక్కులు ఉండగా 85 గేట్లను ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద గోదావరి ప్రవాహం సోమవారం 4.90 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఎగువన వర్షాలు కురుస్తుండటంతో బ్యారేజీ వచ్చే ఇన్‌ఫ్లో పెరుగుతున్నట్లు తెలిపారు. అన్నారం బ్యారేజీకి 3 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 66 గేట్లను ఎత్తి, అంతే నీటిని దిగువకు పంపిస్తున్నట్లు పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

వరంగల్ క్రైం, ఆగస్టు 6: కాకతీయ యూనివర్సిటీ పోలీసులు మంగళవారం పేకాటాడుతున్న వారిని అరెస్టు చేశారు. కేయూ పోలీస్‌స్టేషన్ పరిధిలోని స్వాగత్ గ్రాండ్ హోటల్‌లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. రూ.1లక్ష 23వేల నగదు స్వాధీనం చేసుకుని తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. అదుపులోకి తీసుకున్న వారిని విచారణ నిమిత్తం కేయూ పోలీసులకు అప్పగించారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ రాజు ధ్రువీకరించారు.



హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న బెగ్లూర్ భక్త బృందం

ఐలోని మల్లన్న సన్నిధిలో హనుమాన్ చాలీసా పారాయణం

ఐనవోలు, ఆగస్టు 6: ఐనవోలు మల్లికార్జునస్వామి దేవస్థానంలో మంగళవారం హనుమాన్ చాలీసాతోపాటు భక్తిగీతాల పారాయణం అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగింది. భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం బెగ్లూర్ గ్రామానికి చెందిన హనుమాన్ చాలీసా పారాయణ బృందం సుమారు 25 మంది పాల్గొని పారాయణం చేసి ఆధ్యాత్మికతను చాటారు. భక్తులు ఎంతో భక్తితో ఆలకించారు. ఈ కార్యక్రమంలో ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు, ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, బృందం అధ్యక్షుడు దారం రమణయ్య, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గుట్కా పట్టివేత

వరంగల్ క్రైం, ఆగస్టు 6: హసన్‌పర్తి మండల కేంద్రంలో రూ.6,800 విలువైన నిషేధిత గుట్కాను స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఏఎస్ఐ మల్లిఖార్జున్, కానిస్టేబుళ్లు రాజశేఖర్, నాగరాజు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా మండల కేంద్రంలో అన్నం సురేష్ గుట్కా విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. పోలీసులు సురేష్ నిర్వహిస్తున్న కిరాణషాపుపై దాడులు నిర్వహించి గుట్కాను స్వాధీనం చేసుకున్నారు. పరారయ్యేందుకు ప్రయత్నించిన సురేష్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ మల్లిఖార్జున్ తెలిపారు.

అద్దింటోళ్లంటే.. అంత అలుసా?

కొందరు యజమానుల తీరుతో కిరాయిదారుల అవస్థలు

హనుమకొండ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో అద్దె ఇంట్లో ఉన్న వారి అవస్థలు అన్నీ ఇన్నీ కావు. యజమానులు షరతులు పెడుతూ ఏమాత్రం ఇబ్బంది కలిగినా తక్షణమే ఖాళీ చేయిస్తున్నారు. అలాగే చుట్టుపక్కల ఉండే సొంతిళ్ల వారితో ఇబ్బం దులు తప్పడం లేదు. వారు చూసే చిన్నచూపు, సూటిపోటి మాటలతో అద్దె కుంటుంబం తీవ్ర మనస్తాపానికి గురవుతున్నారు. అయితే తప్పని పరిస్థితుల్లో కాలం వెల్లదీస్తున్నారు. బతుకు దెరువుకోసం నగరానికి వలస వచ్చే వారి సంఖ్య రోజు రోజుకూ పెరిగిపోతోంది. దీనికి తోడు పైచదువుల కోసం నగరానికి వచ్చే విద్యార్థులు కూడా అధిక సంఖ్యలో ఉంటున్నారు. కొందరికి మాత్రమే హాస్టల్ వసతి సమకూరుతోంది. మిగతా వారంతా అద్దె ఇళ్లలోనే తలదాచుకోక తప్పడం లేదు. ప్రైవేటు హాస్టళ్లలో ఉండాల్సి వస్తే భరించలేనంతగా ఫీజులు ఉంటున్నాయి. ఆర్థిక స్థోమత లేని గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు నలుగురైదుగురు కలిసి ఇల్లు అద్దెకు తీసుకొని ఏదో విధంగా తక్కువ ఖర్చుతో నెట్టుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు.

షరతులతో బెంబేలు

పట్టణీకరణ పెరిగిన తర్వాత అద్దె ఇళ్లు పిరమయ్యాయి. అపార్టుమెంట్ సంస్కృతి పెరిగిన తర్వాత ఇండిపెండెంట్ ఇల్లు దొరకడం కష్టంగా మారింది. దొరికినా అద్దె రేట్లు ఆకాశన్నంటుతున్నాయి. అపార్ట్‌మెంట్లలోనూ ఇదే పరిస్థితి. ఈ క్రమంలో ఎక్కడైనా టు లెట్ బోర్డు కనిపిస్తే ఎగిరి గంతేసి వెళ్లి వాకబు చేస్తే యజమాని పెట్టే నిబంధనలతో చుక్కలు కనిపిస్తున్నాయి. కనీస సౌకర్యాలు లేకపోయినా అద్దెలు మాత్రం దండిగానే వసూలు చేస్తున్నారు. డిమాండ్‌ను బట్టి ఏటా 10 నుంచి 15శాతం పెంచుతున్నారు.

క్షణాలమీద ఖాళీకి ఒత్తిడి

యజమానులు అద్దెలను ఇష్టారాజ్యంగా పెంచడమే కాదు.. పెంచినంత అద్దె ఇవ్వడానికి అద్దెకున్నవారు ఏ మాత్రం తటపటాయించినా ఖాళీ చేయమని హుకుం జారీ చేస్తున్నారు. అలాగే తమతో ఏ చిన్న తగాదా వచ్చినా తట్టాబుట్టా సర్దుకోమని చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో తమ ఇంట్లో శుభకార్యం ఉన్నా, లేదా ఇతర దేశాలు, ప్రాంతాల్లో ఉండే కుమారులు, కుమార్తెలు వచ్చినా అద్దెకున్నవారిని నిర్దాక్షిణ్యంగా ఖాళీ చేయిస్తున్నారు. మరమ్మతులు చేయించాలనుకున్నా, లేదా కూలగొట్టి మళ్లీ కట్టాలనుకున్నా కనీస ముందస్తు సమాచారం లేకుండానే ఖాళీ చేయాలని చెబుతున్నారు. మరో ఇల్లు వెతుక్కోవడానికి సమయం కూడా ఇవ్వడం లేదు. వాస్తవానికి అద్దెకున్నవారిని ఖాళీ చేయించాలనుకుంటే టెనెంట్ యాక్టు ప్రకారం ఇంటి యజమానులు కొన్ని నిబంధనలు పాటించాలి. అద్దెకున్నవారికి మూడు నెలలు ముందు సమాచారం ఇవ్వాలి. లేదా మరో ఇల్లు అద్దెకు దొరికే వరకు అవకాశమివ్వాలి. తక్షణం ఖాళీ చేయించే హక్కు లేదు. ఒక వేళ అలా చేస్తే అద్దెకున్నవారు సాయం కోసం పోలీసులను ఆశ్రయించవచ్చు.

దారుణంగా పెరిగిన అద్దెలు

నగరంలో పెరిగిన అద్దెలతో జనం అల్లాడిపోతున్నారు. నిన్నమొన్నటి వరకు ఉన్న ఇంటి అద్దెలతో పోల్చితే ఇప్పుడున్న అద్దెలు మరీ ఎక్కువగా పెరిగాయి. దీంతో పేదలు, సామాన్యులకు బాడుగ ఇళ్లలో ఉండడం కూడా భారంగా మారింది. ఇటీవల కాలంలో హైదరాబాద్ లాంటి నగరాల్లో ఇంటి అద్దెలు 9 శాతం పెరిగితే.. వరంగల్ నగరంలో 6 నుంచి 7 శాతానికి పెరిగాయి. ఇక బస్‌స్టేషన్, రైల్వేస్టేషన్, చౌరస్తా లాంటి ప్రాంతాల్లో ఉన్న ఇళ్లకు అద్దె ఒక రేటు, కాస్త దూరంగా ఉన్నవాటికి మరో రేటు. హనుమకొండ చౌరస్తా, బ్రాహ్మణవాడ, మచిలీబజార్, కాపువాడ, అలంకార్ జంక్షన్, కాజీపేట, నయీంనగర్, నిట్ కేయూ 100 అడుగుల రోడ్డు, కేయూ క్రాస్ రోడ్డు, అంబేద్కర్ జంక్షన్, ఎన్‌జీవోస్ కాలనీ రోడ్డు, టీచర్స్ కాలనీ, రెడ్డి కాలనీ, అడ్వకేట్స్ కాలనీ, బాలసముద్రం లాంటి నగరం నడిబొడ్డున ఉన్న కాలనీల్లో ఇళ్ల అద్దెలు భగ్గుమంటున్నాయి. సింగిల్ బెడ్ రూమ్ ఇళ్లు రూ. 5వేలు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల రూ.7వేల నుంచి రూ.8వేలు, త్రిబుల్ బెడ్ రూమ్ ఇళ్లు రూ. 10వేల నుంచి రూ.15వేల మధ్య అద్దెలు ఉంటున్నాయి. కారు పార్కింగ్, ఇంటీరియర్ డిజైన్లు ఉంటే ఆ ఇళ్లకు వేరే రేటు ఉంటోంది. మెరుగైన సౌకర్యాలు ఉన్న ఇళ్ల అద్దెలు ఇంతకన్నా ఎక్కువనే పలుకుతున్నాయి. అపార్ట్‌మెంట్లలో అయితే డబుల్ లేదా త్రిబుల్ బెడ్ రూమ్ ఫ్లాట్ల అద్దె రేట్లు రూ.15 వేల నుంచి రూ.20వేల వరకు ఉంటున్నాయి. దానికి మెయింటనెన్స్ చార్జీల రూపంలో రూ.1500 నుంచి రూ.2వేలు అదనంగా తీసుకుంటున్నారు. దీంతో చాలామంది నగర నగర శివార్లలో ఉన్న కాలనీలోని ఇళ్లను ఆశ్రయిస్తున్నారు.

- ఏ మాత్రం అసౌకర్యమైనా తక్షణం ఖాళీకి ఒత్తిడి
- కాలనీవాసుల్లోనూ అద్దింటోళ్లపై చులకన భావం
- బ్రహ్మచారులు, నిమ్నవర్గాల వారికి దొరకటం గగనమే..
- భారీగా పెరిగిన అద్దె రేట్లతో ఇబ్బందులు



ఇళ్లు గగనమే

నగరంలో కొన్ని వర్గాల వారికి అద్దె ఇల్లు దొరక్కపోవడం గగనమే అవుతోంది. దళితుల లాంటి నిమ్నవర్గాలకు ఇళ్లు ఇవ్వడానికి అగ్రకులాల యజమానులు నిరాకరిస్తున్నారన్న అపవాదు ఉంది. టు లెట్ బోర్డు చూసి వెళ్లినవారిని మొదట కులమేంటని అడుగుతున్నారు. తక్కువ కులం వారైతే ఇళ్లు ఖాళీగా ఉన్నా లేవని చెప్పి పంపించేస్తున్నారు. చివరకు వారు దళితులకు చెందిన ఇళ్లలో అద్దెకు దొరికితే అదే అదృష్టంగా సర్దుకుపోతున్నారు. అలాగే, బ్రహ్మచారులకు ఇళ్లు అద్దెకు ఇవ్వడానికి యజమానులు వెనుకాముందాడుతున్నారు. పెళ్లీడుకువచ్చిన అమ్మాయిలున్న యజమానులైతే ససేమిరా అంటున్నారు. బ్రహ్మచారులకు ఇల్లు అద్దెకు ఇస్తే ఇబ్బందులు ఎదుర్కొనవలసి వస్తుందన్న భయంతో వారికి నో చెబుతున్నారు. దీంతో బ్యాచిలర్స్ తమ స్నేహితుల ఇళ్లు, లేదా హాస్టల్ గదుల్లో తలదాచుకుంటున్నారు.

అర్ధంతరంగా ఖాళీ చేయించాడు
కుమారస్వామి, బాలసముద్రం, హనుమకొండ

నా ఆఫీసుకు దగ్గరగా ఉంటుందని అద్దె ఎక్కువైనా చెల్లించి హనుమకొండ బాలసముద్రంలోని ఒక అద్దె ఇంట్లో కుటుంబంతో రెండేళ్లుగా ఉంటున్నాను. అద్దె కూడా సకాలంలో చెల్లిస్తూ వచ్చాను. ఒక రోజు ఇంటి యజమానికి, మా కుటుంబ సభ్యులకు మధ్య చిన్న తగాదా ఏర్పడింది. అంతే.. యజమాని అప్పటికప్పుడు ఇల్లు ఖాళీ చేయించాడు. మరో మంచి ఇల్లు వెతుక్కునే అవకాశం కూడా ఇవ్వలేదు. దీంతో అద్దె ఎక్కువైనా సౌకర్యాలు లేకపోయినా దొరికిన ఇంట్లోనే అద్దెకు దిగాము.

కిరాయికి ఉండేటోళ్లా అని నిర్లక్ష్యంగా చూస్తున్నారు..
రామస్వామి, గోపాల్‌పూర్, హనుమకొండ

హనుమకొండలోని గోపాలపూర్‌లోని ఓ సంపన్నమైన కాలనీలో అద్దెకుంటున్నాము. అద్దె కాస్త ఎక్కువే అయినా సర్దుకుపోతున్నారు. కానీ చుట్టుపక్కల సొంతిళ్ల వారు మమ్మల్ని చిన్నచూపు చూస్తున్నారు. ఎవరైనా మా చుట్టాలు, స్నేహితులు మా ఇంటికి వచ్చే క్రమంలో అడ్రస్ అడిగితే గా కిరాయికి ఉన్నోళ్లా.. అంటూ హేళనగా మాట్లాడుతుండడం బాధ కలిగిస్తోంది. పొరుగువారు సొంతిల్లు ఉన్నదన్న పొగరుతో అద్దెకున్నవారిని చిన్నచూపుచూడడం తగదు.

దళితులమని అద్దెకు ఇల్లివ్వలేదు
శ్రీనివాస్, హనుమకొండ

నేను ఒక ప్రైవేటు సంస్థలో ఉద్యోగిని. బదిలీ కావడం వల్ల హనుమకొండకు వచ్చాను. మా ఆఫీసుకు, పైగా చౌరస్తాకు దగ్గరగా ఉంటుందని భావించి సమీప ప్రాంతంలో అద్దె ఇంటికోసం వెతికాను. ఇళ్లు ఖాళీగానే ఉన్నా దళితులమని చెప్పగానే ఓ ఇంటి యజమాని ఇల్లు అద్దెకు ఇవ్వలేమని సున్నితంగా చెప్పాడు. చాలా చోట్ల ఇదే పరిస్థితి ఎదుర్కొన్నా. చివరికు నా చిన్ననాటి స్నేహితుడిఇంటిలో అద్దెకు దిగాను.

ఇరుగుపొరుగు వారి చిన్నచూపు

అద్దెకున్నవారంటే ఇంటి యజమానికే కాదు.. ఇరుగు పొరుగువారికి కూడా చిన్నచూపే. వారితో సరిగా మమేకం కావడానికి కూడా ఇష్టపడడం లేదు. సొంతింటి ఇంటి దారులమన్న అహంతో అద్దెకు ఉంటున్నవారిని దూరంగా పెట్టడం కనిపిస్తోంది. కాజీపేట బాలాజీనగర్‌లో తమపై సొంతిళ్లవారు వివక్ష చూపిస్తున్నారని కొందరు అద్దెలకు ఉండే వారు ఆరోపిస్తున్నారు. కొందరు సొంతిళ్ల వారు అద్దెలకు ఉండే వారిపై యజమాలకు లేనిపోని మాటలు చెప్పి మరీ ఖాళీ చేయిస్తున్న పరిస్థితి ఉంది. దీనికి ఆ కాలనీకమిటీ కూడా వత్తాసు పలకడం విస్మయం కలిగిస్తోంది. బాల సముద్రంలోని ఓ కాలనీలో రాత్రి పూట తలుపుల శబ్దం వినబడుతోందని, పిల్లలు అరుస్తున్నారనే చిన్న చిన్న విషయాలపై పక్కింటివారు గొడవపడి యజమానికి చెప్పి మరీ ఖాళీ చేయించిన సందర్భాలున్నాయి.

అద్దెకుండే వారిలో ఎవరైనా చనిపోతే..

అద్దె ఇంట్లోని కుటుంబసభ్యుల్లో ఎవరైనా అనారోగ్యంతోగానీ, మరే ఇతర కారణాల వల్ల ఆస్పత్రిలో లేదా బయట చనిపోతే ఇంటి యజమానులు మృత దేహాన్ని ఇంటికి తీసుకురానివ్వడం లేదు. దీంతో చేసేది లేక కుటుంబసభ్యులు మృతదేహాన్ని అటునుంచి అటే శ్మశానానికి తీసుకువెళ్లి దహన సంస్కారాలు చేయాల్సి వస్తోంది. ఇంట్లో అద్దెకుంటున్నవారు పది రోజులు బయటనే ఉండి కర్మకాండల తర్వాతే ఇంట్లో అడుపెట్టాల్సి వస్తోంది.

రూ.కోటితో ఉడాయించిన వ్యాపారి?

రెండునెలల్లో భారీగా అప్పులు ● లబోదిబోమంటున్న బాధితులు

కేసముద్రం (మహబూబాబాద్ జిల్లా), ఆగస్టు 6: మహబూబాబాద్ జిల్లా కేసముద్రం స్టేషన్‌కు చెందిన ఓ వ్యాపారి అప్పులు చేసి సుమారు రూ.కోటితో ఉడాయించినట్లు ప్రచారం జరుగుతోంది. మండల కేంద్రంలోని పాన్‌షాప్‌లలో సిగరెట్లు, పాన్‌మసాలాలు, ఇతర సామగ్రిని హోల్‌సేల్‌గా సరఫరా చేసే ఈ వ్యాపారి కొద్దిరోజుల కిందట తన కుటుంబంతో సహా అదృశ్యమయ్యాడు. స్థానికంగా సొంత ఇల్లు, ట్రాలీ ఆటో ఉండడంతో పాటు నిత్యం వేల రూపాయల హోల్ సేల్ వ్యాపారం చేస్తుండడంతో అప్పు అడగగానే ఇచ్చారు. ఒక్కొక్కరి వద్ద రూ. లక్షల నుంచి రూ.10లక్షల వరకు అప్పులు తీసుకున్నట్లు సమాచారం. స్థానికంగా చిట్టీలు నిర్వహించే వారి వద్ద రూ.2లక్షల నుంచి రూ.5లక్షల చిట్టీల్లో చేరి మొదటి నెలలోనే అధిక కమీషన్‌తో ఎత్తుకున్నట్లు తెలిసింది. ఆ తర్వాతి రెండు, మూడునెలల వరకు సకాలంలో చిట్టీ డబ్బులు చెల్లిస్తూ అదృశ్యం కావడానికి రెండునెలలకు ముందు అప్పులు, ఎత్తుకున్న చిట్టీలు సుమారు రూ.కోటి వరకు పోగేసినట్లు తెలిసింది. కుటుంబం సహా ఫోన్ స్విచ్‌ఆఫ్ చేసుకొని ఇక్కడి నుంచి ఉడాయించడం ఓ పథకం ప్రకారమే తక్కువ కాలంలో ఎక్కువ అప్పులు చేసి, చిట్టీలు ఎత్తుకున్నట్లు అనుమానిస్తున్నారు. సొంత ఇల్లుపై బ్యాంకులో రూ.25 లక్షల వరకు రుణం తీసుకోగా, ట్రాలీఆటో ఫైనాన్స్‌లో తీసుకువచ్చిందని తెలుసుకున్న అప్పులిచ్చిన వారు లోలోపల లబోదిబోమంటున్నారు. ఈ విషయంపై పోలీసులను ఆశ్రయించేందుకు బాధితులు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఇక చిట్టీల వ్యవహారమంతా అనధికారికం కావడంతో ఎవరికి చెప్పుకునే పరిస్థితి లేకుండా పోయింది. ఇదిలా ఉండగా వ్యాపారంలో నష్టాలు రావడం, ఆన్‌లైన్ గేమ్‌లను ఆడడంతో దివాళా తీసి ఉడాయించినట్లు మరికొందరు భావిస్తున్నా రు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 6: తెలంగాణ ఓపెన్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ టెన్త్, ఇంటర్‌లలో ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకోవాల్సింది గా ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మురాల శంకర్‌రావు మంగళవారం ఒక ప్రటనలో తెలిపారు. సెప్టెంబర్ 10 వరకు దరఖాస్తులు చేసుకునే అవకాశముందని పేర్కొన్నారు. అడ్మిషన్ ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించి వారికి అందుబాటులో ఉన్న ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాల్లో సంప్రదించి ప్రవేశాలు పొందాలని కోరారు. టెన్త్‌కు అడ్మిషన్ ఫీజు ఓసీలకు రూ.1550, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు రూ.1150 చెల్లించాలన్నారు. ఇంటర్‌లో ప్రవేశాలకు ఓబీసీలకు రూ. 1800, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు రూ.1500 ఆన్‌లైన్‌లో చెల్లించాలని తెలిపారు. పూర్తి వివరాలకు కోఆర్డినేటర్ శంకర్‌రావు (8008403631, 9396337572)ను సంప్రదించాలని ఆయన కోరారు.

ఊడిన గూడ్స్ రైలు బోగీల లింకు

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 6 : మహబూబాబాద్-తాళ్లపూసపల్లి రైల్వే స్టేషన్ల నడుమ అప్‌లైన్‌లో 434 మైలురాయి వద్ద వరంగల్‌వైపు వెళ్తున్న గూడ్స్‌రైలు బోగీల మధ్య లింక్ (కప్లింగ్) మంగళవారం ఊడిపోయి గూడ్స్ రైలు నిలిచి పోయింది. విషయం తెలుసుకున్న రైల్వే అధికారులు దానిని సరి చేసి అక్కడి నుంచి పంపించారు. దీంతో గూడ్స్ వెనుకాల వస్తున్న వందేభారత్ రైలును మానుకోట రైల్వేస్టేషన్‌లో సుమారు అరగంట పాటు నిలిపారు. గూడ్స్ రైలు బోగిలను సరి చేసి పంపించాక మానుకోట రైల్వేస్టేషన్ నుంచి వందేభారత్ రైలు కదిలి వెళ్లిపోయింది.

సర్వీసుల క్రమబద్ధీకరణకు హోంగార్డుల వినతి

వరంగల్ క్రైం, ఆగష్టు 6: రాష్ట్రంలోని హోంగార్డుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని కోరుతూ మంగళవారం హైదరాబాద్‌లో డీజీపీ జితేందర్‌ను కలిసి హోంగార్డులు వినతిపత్రం ఇచ్చారు. సీనియారిటీ, విద్యార్హతల ఆధారంగా ఏదైనా యూనిఫామ్ సర్వీసులలో విలీనం చేయాలని కోరారు. ఆరోగ్య భద్రత, ఉద్యోగ భద్రత కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. డీజీపీని కలిసిన వారిలో రాష్ట్ర హోంగార్డుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పుప్పాల అశోక్, వర్కింగ్ ప్రసిడెంట్ దయానంద్, జాయింట్ సెక్రెటరీ నారాయణరెడ్డి, పీఆర్‌వో రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

వీరభద్రస్వామి దీక్షలో మంత్రి పొన్నం



వీరభద్రస్వామి మాలను ధరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

భీమదేవరపల్లి, ఆగస్టు 6: కొత్తకొండ శ్రీవీరభద్రస్వామి నక్షత్ర దీక్షను బీసీ సంక్షేమ, రావాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం స్వీకరించారు. 27రోజులుగా ఉండే వీరభద్రస్వామి నక్షత్ర దీక్షను ఆలయ ముఖ్య అర్చకుడు, దీక్షల గురుస్వామి మొగిలి పాలెం రాంబాబు వీరభద్రస్వామి ఆలయంలో వీరభద్రుడి ముద్రికతో ఉన్న మాలను మంత్రి పొన్నం ప్రభాకర్ మెడలో వేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆలయ ఈవో కిషన్‌రావు పాటు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎన్నికలకు ముందు తాను ఎమ్మెల్యేగా గెలిచి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వీరభద్రస్వామి నక్షత్ర దీక్షలు తీసుకుంటానని మొక్కుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఎమ్మెల్యేగా గెలిచిన పొన్నం ప్రభాకర్ మంత్రిగా కూడా ప్రమాణస్వీకారం చేశారు. దీంతో 27రోజుల పాటు దేవాలయంలో నియమ నిబంధనలకు అనుగుణంగా పూజ కార్యక్రమాల్లో పాల్గొంటానని తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కొత్తకొండ వీరభద్రస్వామి చరిత్రను రాష్ట్ర ప్రజలకు తెలిసే విధంగా చర్యలు తీసుకుంటానన్నారు. ద్వాదశ జ్యోతిలింగాల్లో ఒకటైనా శ్రీశైలం మల్లిఖార్జున స్వామిని సోమవారం దర్శించుకున్నానన్నారు. శ్రీశైలంలో దేవుడి పక్కనే భద్రకాళి సమేత శ్రీవీరభద్రస్వామి విగ్రహం ఉందన్నారు. ఇంత మహిమ కలిగిన ఈ దేవాలయాల్లో ఉమ్మడి కరీంనగర్, వరంగల్, మెదక్, ఆదిలాబాద్ జిల్లాల్లోని భక్తులు పెద్దఎత్తున తరలివస్తారన్నారు. ఈ విశ్వాసం భక్తులకు ఆకాంక్షలకు అనుగుణంగా వీరభద్రస్వామి దీక్ష తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కిషన్‌రావు, బొమ్మ శ్రీరాంచక్రవర్తి, మంజులారెడ్డి, కొత్తకొండ దేవస్థానం మాజీ చైర్మన్లు పిడిశెట్టి కనకయ్య, చంద్రశేఖర్‌గుప్తా, చిట్టంపల్లి అయిలయ్య, మాజీ ఎంపీపీ అశోక్‌ముఖర్జీ, కేతిరి లక్ష్మారెడ్డి, మంగ రామచంద్రం, కొల్లూరి రాజు, ఆదరి రవీందర్, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిజంలో మార్పులు సహజమే..

సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్టు డాక్టర్ ఎస్.వెంకటనారాయణ



డాక్టర్ వెంకటనారాయణకు జ్ఞాపికను బహుకరిస్తున్న ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు

వడ్డెపల్లి, ఆగస్టు 6: మారుతున్న కాలానికనుగుణంగా జర్నలిజంలో మార్పులు సహజమేనని ఇండియాటుడే పూర్వప్రతినిధి, మల్టీ మీడియా ఇండిపెండెంట్ సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్టు డాక్టర్ ఎస్. వెంకటనారాయణ అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జర్నలిస్టులతో చిట్‌చాట్ చేశారు. అనంతరం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో డాక్టర్ వెంకటనారాయణ మాట్లాడుతూ.. ప్రస్తుతం జర్నలిజంలో వస్తున్న మార్పుల కనుగుణంగా డిజిటల్ మీడియా హవా చలాయిస్తోందని అన్నారు. బంగ్లాదేశ్‌లో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా భారత్‌తో స్నేహపూర్వకంగా ఉండాల్సిందేనని చెప్పారు. బంగ్లాదేశీయులు లండన్‌లో రెస్టారెంట్లు పెట్టుకున్నారని, అయితే పాకిస్థానీయులైనా, బంగ్లాదేశీయులైనా ఇండియన్ రెస్టారెంట్ పేరుతో నడిస్తారని చెప్పారు. భారతదేశం అంటే ప్రపంచమంతా తెలుసునని, బంగ్లాదేశ్ పేరు చెప్పితే ఎవరికీ తెలియదని అన్నారు. బంగ్లాదేశ్‌లో జరుగుతున్న అల్లర్లతో ఆ దేశ ప్రధాని షేక్‌హసీనా నేరుగా ఇండియాకు వచ్చారని పేర్కొన్నారు. అయితే ఇక్కడి ప్రధానిని కానీ మరెవరిని కలవలేదని అన్నారు. నేషనల్ సెక్యూరిటీ అడ్వయిజర్ మాత్రమే వెళ్లి మాట్లాడారని చెప్పారు. తాను ఏపీ సీఎం చంద్రబాబు జీవిత చరిత్ర రాస్తున్నానని తెలిపారు. ఈ నెల 22 నుంచి రెండు వారాల పాటు ఏపీలోని అమరావతిలో ఉంటానని చెప్పారు.

ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కోశాధికారి బోళ్ల అమర్, ప్రెస్‌క్లబ్ బాధ్యులు గోకారపు శ్యామ్, విష్ణువర్ధన్, సీనియర్ జర్నలిస్టులు గడ్డం కేశవమూర్తి, పిన్న శివకుమార్, పీవీ మదన్‌మోహన్, వల్లాల వెంకటరమణ, చిలుముళ్ల సుధాకర్, వేముల సదానందం, మెండు రవీందర్, అంతడుపుల శ్రీనివాస్, నన్నపునేని భరత్, జడ్పీ మాజీ చైర్మన్ సాంబారి సమ్మారావుతో పాటు యూనివర్సిటీ ప్రొఫెసర్లు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

రాష్ట్ర సాంఘిక సంక్షేమ వసతి గృహాల సెక్రటరీ అలుగు వర్షిణి



మహబూబాబాద్‌లోని సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో మొక్కను నాటుతున్న స్వచ్ఛదనం-పచ్చదనం ప్రత్యేకాధికారి అలుగు వర్షిణి

మహబూబాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్‌ను నిషేధించి, ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని 'స్వచ్ఛదనం-పచ్చదనం' జిల్లా ప్రత్యేకాధికారి, రాష్ట్ర సాంఘిక సంక్షేమ వసతి గృహాల సెక్రటరీ అలుగు వర్షిణి అన్నారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కొత్తపేట, జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ హాస్టల్‌ను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొత్తపేటలో చేపట్టిన స్వచ్ఛదనం-పచ్ఛదనంలో గ్రామస్థాయిలో ప్రజలకు పూర్తి అవగాహన కల్పించి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్వయం సహాయక బృందాలు, వీవోలు, పంచాయతీ సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేసి గ్రామస్థాయిలో నిర్వహిస్తున్న స్వచ్ఛదనం-పచ్చదనం తీరు గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్కను నాటా రు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పాఠశాలలో తడిచెత్త, పొడిచెత్త వేరుచేయడం, ప్లాస్టిక్ రహిత సమాజం కోసం అనే నాటికను ప్రదర్శించగా పిల్లలతో కలిసి వీక్షించారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. గ్రామ స్థాయిలో పారిశుధ్య పనులు పక్కాగా చేపట్టాలని, అంతర్గత రోడ్ల అభివృద్ధి, గ్రామంలో స్వచ్ఛత, పచ్చదనం ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం మహబూబాబాద్ జిల్లాకేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని సందర్శించి పిల్లలతో మాట్లాడారు. పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ మాట్లాడుతూ స్వచ్ఛదనం-పచ్ఛదనంను పక్కాగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుని ప్రత్యేకాధికారులను నియమించి క్షేత్రస్థాయిలో విజయవంతం చేస్తున్నామని చెప్పారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో, మానుకోట ఆర్డీవో అలివేలు, జిల్లా అధికారులు నర్మద, హరిప్రసాద్, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, దైవాదీనం, చంద్రస్వామి పాల్గొన్నారు.

పోలీసు అధికారులకు డీజీపీ ప్రశంసలు



డీజీపీ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న సీఐ శ్రీధర్‌రావు

వరంగల్ క్రైం, ఆగష్టు 6: హత్య కేసుల్లో నిందితులకు జీవిత ఖైదు శిక్ష పడటానికి కృషి చేసిన ఇద్దరు సీఐలతో పాటు గతంలో వరంగల్‌లో పనిచేసిన ఏసీపీ, ఎస్ఐలకు డీజీపీ జితేందర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందచేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయంలో డీజీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోలీసు అధికారుల సమావేశంలో విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులకు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు ప్రశంసాపత్రాలు అందించారు. పత్రాలు అందుకున్న వారిలో ప్రస్తుతం సీసీఆర్‌బీలో పనిచేస్తున్న సీఐ శ్రీధర్‌రావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజమల్లారెడ్డి, మామూనూర్ సీఐ రవికుమార్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సత్యనారాయణరెడ్డి, అడిషినల్ ఎస్పీ బోనాల కిషన్, తొర్రూరు ఎస్ఐ జగదీష్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాసుదేవరెడ్డి ఉన్నారు. కాగా, వీరిని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అభినందించారు.

కొత్త రేషన్ కార్డులకు ఎన్నికల గండం

- కార్డుల జారీకి సబ్ కమిటీని ఏర్పాటు చేసిన సర్కార్
- సబ్ కమిటీ నివేదిక తరువాత దరఖాస్తుల పరిశీలన
- త్వరలోనే జారీ చర్యలంటున్న అధికారులు
- పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడితే ప్రక్రియలో జాప్యమేనా?



హనుమకొండ సిటీ, ఆగస్టు 6: కొత్త రేషన్ కార్డుల జారీకి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కార్డుల జారీ ఉంటుందని ప్రకటించిన వెంటనే కేబినెట్ కూడా ఆమోదం తెలపడంతో పాటు కార్డుల జారీ విధానాల కోసం ప్రభుత్వం ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. దీంతో హనుమకొండ జిల్లాలో రేషన్ కార్డుల జారీకోసం దరఖాస్తు చేసుకున్న వారితో పాటు కొత్తగా దరఖాస్తు చేసుకోవాలనే వారిలో ఆశలు చిగురించాయి. కానీ పంచాయతీ ఎన్నికలు వారిలో గుబులు పుట్టిస్తున్నాయి. రేపో,మాపో పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ అనే సంకేతాలు ఉండగా.. అదే జరిగితే ఎన్నికల ప్రక్రియలో యంత్రాంగం తలమునలై కార్డుల జారీలో జాప్యం జరుగుతుందేమో అనే సందేహాలు నెలకొంది. కానీ ప్రభుత్వం సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటుందని లబ్ధిదారులు ఆశిస్తున్నారు.

సబ్ కమిటీ ఏర్పాటు

కొత్త రేషన్‌కార్డుల జారీ కోసం రాష్ట్ర ప్రభుత్వం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చైర్మన్‌గా, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ సభ్యులుగా మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసింది. ఈ ఉప సంఘం పేదలకు రేషన్ కార్డులజారీకి సంబంధించిన విధి విధానాలను నిర్దేశించనుంది. ఆపై ముఖ్యమంత్రికి నివేదించిన అనంతరం రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ఆరంభం కానుందని పౌర సరఫరాలశాఖ అధికారులు చెబుతున్నారు. సబ్ కమిటీ కార్డుల జారీ మార్గ దర్శకాలను రూపొందించిన తరువాత ప్రభుత్వం స్పష్టమైన నిబంధనలను వెల్లడి చేస్తోందని, ఆ తరువాత కార్డుల జారీ ప్రక్రియ జిల్లాలో ఆరంభం అవుతుందని పౌర సరఫరాల శాఖ అధికారులు అంటున్నారు.

తొమ్మిదేళ్లుగా నమోదుతోనే సరి

బీఆర్ఎస్ హయాంలో కొత్త రేషన్ కార్డుల జారీకి అర్హులైన పేదల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కొత్త కార్డులతో పాటు అదనంగా కుటుంబ సభ్యుల పేర్ల నమోదు దరఖాస్తులను చేపట్టారు. కానీ ఒక్క కార్డు జారీ కాలేదు. ఇలా తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలన కార్డులను జారీ చేయకుండానే ముగిసింది. రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ అధికారం చేపట్టగానే రేషన్‌కార్డుల జారీకి సిద్ధమని ప్రకటించింది. ఇటీవల సబ్‌కమిటీ ఏర్పడడంతో త్వరలో కార్డులు వస్తాయని దరఖాస్తుదారులు ఆశపడుతున్నారు.

జిల్లాలో 5580 దరఖాస్తులు

హనుమకొండ జిల్లాలో రేషన్‌కార్డుల కోసం 5,580దరఖాస్తులు నమోదయ్యాయి. ప్రభుత్వం జిల్లాల వారీగా రేషన్‌కార్డుల దరఖాస్తుల సంఖ్యను కోరిన క్రమంలో జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి నివేదించింది. ప్రభుత్వం మార్గదర్శకాల మేరకు 5,580 దరఖాస్తుల పరిశీలన ఆరంభమై అర్హుల సంఖ్య నిర్ధారణ కానుంది. అదే విధంగా కుటుంబ సభ్యుల పేర్లు చేర్పుల ప్రక్రియ కూడా ఉండనుంది.

పంచాయతీ ఎన్నికల భయం

కొత్త కార్డుల జారీపై ఒక ఆనందం.. ఆ వెంటే పం చాయతీ ఎన్నికల భయం దరఖాస్తుదారులను వెంటా డుతోంది. రేపో, మాపో పంచాయతీ ఎన్నికలు జరుగనున్నాయనే సంకేతాలు, నోటిఫికేషన్ విడుదల అం శం దరఖాస్తుదారుల్లో సందేహాన్ని కలిగిస్తోంది. ఇదే జరిగితే కార్డుల జారీకి మళ్లీ అవరోధం తప్పని పరిస్థితి. పంచాయతీ ఎన్నికలు, ఆపై జిల్లా పరిషత్ ఎన్నికలు, కోడ్ ముగిసిన తరువాత అంతా సర్దుబాటు చేసే సమయం.. ఇదంతా జరిగే వరకు మరో మూడు నెలల బ్రేక్ తప్పదని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



కేయూ పీఎస్‌లో బాలుడితో సీఐ సంజీవ్

కిడ్నాపైన బాలుడు తల్లిదండ్రులకు అప్పగింత

వరంగ్ క్రైం, ఆగష్టు 6: బిస్కెట్లు ఇస్తానని చెప్పి.. బిట్టు అనే ఐదేళ్ల బాలుడిని కిడ్నాప్ చేయగా, గంట సమయంలో బాలుడిని పట్టుకున్న కేయూ పోలీసులు.. తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సంఘటన మంగళవారం కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్టేషన్ పరిధిలోని పూరిగుట్ట ప్రాంతానికి చెందిన బాలుడు కిడ్నాప్ అయినట్లు సమాచారం అందుకున్న సీఐ సంజీవ్.. సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. వెతుకుతున్న క్రమంలో పోలీసుకాలనీకి చెందిన పంతేగాని కార్నేయస్ (రైల్వే ఉద్యోగి) అనే వ్యక్తి బండిమీద బాలుడిని తీసుకుని వెళుతుండగా అనుమానం వచ్చి పట్టుకున్నారు. విచారణలో బిట్టును కిడ్నాప్ చేసి తీసుకెళుతున్నట్లు నిర్ధారణ అయింది. కాగా, కార్నేయస్‌ను అదుపులోకి తీసుకుని బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. బాలుడిని కిడ్నాప్ చేసిన నిందితుడు కార్నేయస్‌పై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ సంజీవ్ తెలిపారు. కాగా, బిట్టు మహబూబాబాద్ జిల్లా ఉత్తర తండాకు చెందిన బోడ సురేష్ - ప్రియాంక దంపతుల కుమారుడు. పూరిగుట్ట వద్ద అమ్మమ్మ వినోద వద్ద ఉంటున్నాడు.

ఘనంగా జయశంకర్ జయంతి




భూపాలపల్లిలో జయశంకర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న (వేర్వేరుగా) ఎమ్మెల్యే సత్యనారాయణరావు, మాజీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

భూపాలపల్లిటౌన్, ఆగస్టు 6: తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు భూపాలపల్లిలో ఘనంగా జరిగాయి. పట్టణంలోని జయశంకర్ విగ్రహానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్ శర్మ పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి నివాళి అర్పించారు. మునిసిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి ఆధ్వర్యంలో జయంతి వేడుకలు జరిగాయి. కమిషనర్ రాజేశ్వర్, మునిసిపల్ వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి, అధికారులు భాస్కర్, సునీల్, మానస, కాంగ్రెస్ నాయకులు బుర్ర కొంరయ్య, గాజర్ల అశోక్, చల్లూరి మధు, దేవన్, శ్రీరాములు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● గణపురం : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో భాస్కర్, గ్రంథాలయంలో ఆముదాల మురళి, కేటీపీపీలో సీఈ సిద్ధయ్య ఆధ్వర్యంలో జయశంకర్ జయంతిని నిర్వహించారు.

● మహదేవపూర్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డి.రమేష్ ఆధ్వర్యంలో జయశంకర్ వేడుకలను నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ చంద్రపల్కల ప్రసాద్, అధ్యాపకులు సమ్మయ్య, సదాశివ్, సంధ్య, శ్వేత, నాగలక్ష్మి, శైలజ, పోచయ్య, పిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

● ఏటూరునాగారం రూరల్ : జయశంకర్ జయంతి వేడుకలు మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో జరిగాయి. ఆయన చిత్రపటానికి ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా పూలమాల వేసి నివాళులర్పించారు. డీడీ పోచం, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ క్రాంతి కుమార్, మేనేజర్ శ్రీనివాస్, జేడీఎం కొండల్‌రావు, పీసా కోఆర్డినేటర్ కొమురం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

● గోవిందరావుపేట: జయశంకర్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉద్యమ కారుల సంఘం నాయకులు కడారి తిరుపతి, హేమాద్రి, అకినపల్లి రమేష్, సంజీవ, బత్తుల రాణి, కుమ్మరి వెంకన్న, కొండి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

● కృష్ణకాలనీ (భూపాలపల్లి): భూపాలపల్లి పోలీస్ కార్యాల యంలో ఎస్పీ కిరణ్‌ఖరే ఆదేశాల మేరకు జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భూపాలపల్లి సీఐ నరేష్‌కుమార్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ రత్నం, సీసీ ఫసియొద్దీన్, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● చిట్యాల: మండంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలోనూ కార్యక్రమం జరిగింది. ఏఐవైఎస్ నాయకులు పుల్ల మల్లయ్య, జన్నె యుగందర్, మారపెల్లి మల్లేష్, రాజేందర్, ఉపాధ్యాయులు ఝాన్సీరెడ్డి, రఘుపతి, కిరణ్‌కుమార్, తిరుపతిరెడ్డి, కాకతీయ హైస్కూల్ కరస్పాండెంట్ రాజ్‌మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

● కాటారం: మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల్లో, పోలీస్‌స్టేషన్ ఆవరణలో, గిరిజన సంక్షేమ బాలుర గురుకులంలో జయశంకర్ జయంతి వేడుకలు నిర్వహించారు. జయశంకర్ చిత్రపటానికి ఎంపీడీవో బాబు, ఎంపీవో వీరస్వామి వేర్వేరుగా పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జీపీ కార్యాలయాల్లోనూ ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, నాయకులు జయశంకర్ చిత్రపటాలకు పూల మాలలు వేశారు. ఈ కార్యక్రమాల్లో ఏపీవో వెంకన్న, ప్రిన్సిపాల్ రాజేందర్, వైస్ ప్రిన్సిపాల్ మాధవి, వెంకటయ్య, జూనియర్ అసిస్టెంట్స్ జగదీశ్వర్‌రెడ్డి, హమీద్, రమాదేవి పాల్గొన్నారు.

● మల్హర్: మండల కేంద్రమైన తాడిచర్లలోని ఎంపీడీవో కార్యాలయంతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల, పెద్దతూండ్ల ఉన్నత పాఠశాలలో జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో శ్యామ్‌సుందర్, ఎంపీవో విక్రమ్, కార్యాలయ సిబ్బంది, కళాశాల ఆధ్యాపకులు, తాజా మాజీ ఎంపీపీ మల్హల్‌రావు, ప్రధానోపాధ్యాయులు తిరుపతి, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

● ఏటూరునాగారం: మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలోని జయశంకర్ విగ్రహానికి బీఆర్ఎస్ మండల నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గడదాసు సునీల్ కుమార్, పార్టీ సీనియర్ నాయకుడు తుమ్మ మల్లారెడ్డి, ఏటూరునాగారం పట్టణ అధ్యక్షుడు ఎమ్డీ. ఖాజా పాషా, మేడారం ట్రస్ట్ బోర్డ్ మాజీ డైరెక్టర్ సప్పిడి రామనర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

● కన్నాయిగూడెం: మండలంలోని గుర్రేవుల జడ్పీఎస్ఎస్ పాఠశాలలో జయశంకర్ జయంతిని నిర్వహించారు. పీఆర్‌టీయూ జిల్లా కార్యదర్శి కొయ్యడ సురేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజు, అంజయ్య, రమేష్, సమ్మక్క, కల్పన తదితరులు పాల్గొన్నారు.

● మంగపేట: మండలంలో జయశంకర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఎంపీడీవో కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, జ్యోతి మహిళా మండల సమాఖ్య కార్యాలయం, ఫారెస్ట్ ఆఫీసు, పోలీస్‌స్టేషన్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, మండల ప్రత్యేక అధికారి తుల రవి, ఎంపీడీవో బి.శ్రీకాంత్, ఎంపీవో శ్రీనివాస్, సూపరింటెండెంట్ సుదర్శన్, తహసీల్దార్ బి. వీరస్వామి, డీటీ మల్లేశ్వర్‌రావు, ఆర్‌ఐలు శ్రీనివాస్, ఏసు పాదం, ఫారెస్టు రేంజర్ షకీల్‌పాషా, ఎస్సై టీవీఆర్. సూరి, పంచా యతీ కార్యదర్శులు, గ్రామాల ప్రత్యేక అధికారులు, ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయులు, బిల్ట్ కార్మికులు, తెలంగాణ వాదులు పాల్గొన్నారు.

● తాడ్వాయి: మండలవ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో జయశంకర్ జయంతి వేడుకలు జరిగాయి. మండల కేంద్రంలోని ఇందిరానగర్ జడ్పీహెచ్ఎస్‌లో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మండల నోడల్ ఆఫీసర్ రేగ కేశవరావు, ఉపాధ్యాయులు చంద్రారెడ్డి, బాబూరావు, లక్ష్మయ్య, స్వామి, అఖిల్, సురేందర్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

● వాజేడు: జయశంకర్ జయంతిని మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎస్. శ్రీనివాస్ నాయబ్ తహసీల్దార్ రాహుల్ చంద్ర వర్మ, సిబ్బంది కుందమల్ల నాగరాజు, రాంబాబు, బాలచంద్రమూర్తి పాల్గొన్నారు.

● వెంకటాపురం(నూగూరు : స్థానిక ఎంపీడీవో కార్యాయంలో జయశంకర్ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వర్షానికి ఇల్లు నేలమట్టం

ఏటూరునాగారం, ఆగస్టు 6: సోమవారం రాత్రి మంగళవారం ఉదయం వరకు కురిసిన వర్షానికి మండల కేంద్రంలోని నాలుగవ వార్డు యాదవ్ నగర్‌లో మాటూరి పోతురాజు, బానమ్మకు చెందిన గుడిసె నేలమ ట్టమైంది. కూలినాలి చేసుకొని ఇద్దరు పిల్లలను పోషించుకుం టున్న ఈ దంపతులు ఈ ఘటనతో తీవ్ర మనస్తాపం చెందుతున్నారు. తమకు నిలువనీడ లేకుండా పోయిందని, ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

వీరభద్రవరంలో..

వెంకటాపురం(నూగూరు): మండలంలో కురుస్తున్న భారీ వర్షానికి వీరభద్రవరం గ్రామంలోని పూనెం రాజేష్‌కు చెందిన పూరిల్లు సోమవారం రాత్రి కుప్పకూలింది. గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాజేష్ కుటుంబసభ్యులతో కలిసి ఇంట్లో నిద్రిస్తుండగా ఒక్కసారిగా వర్షానికి పెద్దశబ్దం వచ్చి ఇల్లు కూలిపోతుండగా బయటకు పరుగులు తీశారు. దీంతో పెనుప్రమాదం తప్పింది. ఈప్రమాదంలో ఇంట్లో ఉన్న విలువైన వస్తుసామగ్రి, నిత్యావసర సరుకులు ధ్వంసమయ్యాయి.

12న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

కాటారం, ఆగస్టు 6: పాలిటెక్నిక్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న సీట్లకు ఈ నెల 12న స్పాట్ అడ్మిషన్లు ఉంటాయని కాటారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రాజ్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 8వ తేదీ నుంచి 11వరకు స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. కళాశాలలో సీట్ల ఖాళీల వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. 12న నిర్వహించే స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియకు విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలకు హాజరు కావాలని పేర్కొన్నారు.

ములుగులో గద్దర్ వర్ధంతి సభ



ములుగులో కళాకారుల ర్యాలీ

ములుగు రూరల్ ఆగస్టు 6: ప్రజా గాయకుడు గద్దర్ వర్ధంతి సభ ములుగులోని డీఎల్ఆర్ గార్డెన్‌లో మంగళవారం జరిగింది. అంబేద్కర్ విగ్రహం నుంచి డప్పు వాయిద్యాలతో ర్యాలీని నిర్వహించారు. నాయకులు కళాకారులు గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆట పాటలతో కళాకారులు ఉర్రూతలూగించారు. కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు గోల్కొండ బుచ్చన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బాదం ప్రవీణ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కళారంగానికి గద్దర్ చేసిన సేవలను కొనియాడారు. అనంతరం సీనియర్ కళాకారులు డాక్టర్ పోరిక శామ్యూల్ నాయక్, ములుగు గద్దర్ పోలేపాక యాకయ్యను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు, కళాకారుల సంఘం నాయకులు, పాల్గొన్నారు.

మహదేవపూర్‌లో..

మహదేవపూర్ : మహదేవపూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ ఆధ్వర్యంలో గద్దర్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి అర్పించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కలకోట రాజబాబు, ప్యాక్స్ చైర్మన్ చల్ల తిరుపతయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీధర్, బీసీ సంఘం ముదిరాజ్ నాయకులు గడ్డం స్వామి, యాదవ సంఘం నాయకులు, ఐలయ్య, సీనియర్ నాయకులు గడ్డం స్వామి, యాదవ సంఘ నాయకులు కన్నెబోయిన ఐలయ్య, దళిత మైనారిటీ నాయకులు ఉస్మాన్, సంఘం సీనియర్ నాయకులు ధర్మయ్య తదితులు పాల్గొన్నారు.

'ఉపాధి'పై అనుమానాలు!

5వ పేజీ తరువాయి

బృందాల తనిఖీల్లో అక్రమాలు వెలుగు చూస్తే ఉపాధి పనులకు నిధుల మంజూరులో ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఒత్తిడితోనే..

ఈ ఏడాది ఉపాధి పనులను లక్ష్యానికి అనుగుణంగా చేపట్టాలని సిబ్బందిని పురమాయించడంతో పాటు గతానికంటే భిన్నంగా రోజు వారీ ప్రగతిపై సమీక్షించడం వల్లే కూలీల హాజరు సంఖ్య పెరిగిందని అధికారులు చెబుతున్నారు. కేంద్ర బృందాల తనిఖీల్లో వాస్తవాలు వెలుగు చూడనున్నాయి. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ కార్యాలయాల్లో పనులు, కూలీలు, పని దినాలకు సంబంధించిన రికార్డులను తయారు చేసే పనిలో అధికారులు నిమగ్నమై ఉన్నారు. ఈ వేసవిలో కూలీలు ఇతర ప్రాంతాలకు వెళ్లి పనులు వెతుక్కునే అవకాశం లేకుండా స్థానికంగానే ఉపాధి పథకం కింద పనులు చూపిస్తామని అధికారులు గ్రామాల్లో ప్రచారం నిర్వహించడంతో కూలీల సంఖ్య పెరిగింది. ఉపాధి కూలీ రూ.270 నుంచి రూ.300 పెరగడంతో అధిక సంఖ్యలో పనులు చేసేందుకు కూలీలు ముందుకు వస్తున్నారనేది మరో కారణం. క్షేత్ర స్థాయిలో వారానికి ఒక రోజు పనులు పరిశీలించడంతో పాటు, కూలీల హాజరు తక్కువగా ఉన్న చోట పెంచే విధంగా అవగాహన కల్పించారు. వార్షిక ఉపాధి ప్రణాళికలో రూపొందించిన పనుల దినాల్లో ఏప్రిల్, మే, జూన్ నెలల్లో 70 శాతానికి చేరుకోవాలనే లక్ష్యంతో సిబ్బంది పని చేశారు. దీంతో కూలీల హాజరు శాతం పెరిగిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామాల్లో కూలీలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో అధికారులు పర్యటనలు చేసి పనులకు రాని వారితో సమా వేశాలు నిర్వహించారు. గతంలో ఉపాధి కూలీల వేతనాల కోసం రోజుల తరబడి నిరీక్షించే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం సకాలంలో వేతనాలు బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుండటంతో పనులకు వచ్చే వారి సంఖ్య పెరిగిందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

జాతీయ రహదారిపై పశువులను వదిలితే చర్యలు

'ఆంధ్రజ్యోతి' కథనంపై స్పందించిన అధికారులు

కాటారం, ఆగస్టు 6: మండలకేంద్రంతో పాటు ఇతర ప్రాంతాల్లో జాతీయ రహదారి, ప్రధాన రహదారులపై పశువులను వదిలేస్తే వాటి యజమానులపై చర్యలు తప్పవని ఎంపీడీవో బాబు, ఎంపీవో వీరస్వామి, ఎస్సై అభినవ్ హెచ్చరించారు. మంగళవారం అంబేద్కర్ కూడలిలో సంచరిస్తున్న పశువులను వారు పరిశీలించారు. రోడ్లపై పడుకున్న పశువులతో వాహనదారులకు కలుగుతున్న ఇబ్బందులను స్వయంగా చూశారు. 'జాతీయ రహదారిపై పశువుల సంచారం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఈ మేరకు స్పందించిన అధికారులు నివారణ చర్యలకు ఉపక్రమించారు. పశువుల యజమానులకు పంచాయతీ కార్యదర్శి సమీర్‌ఖాన్ ద్వారా నోటీసులు ఇస్తామని తెలిపారు. పశువులను ఇళ్లకు తీసుకెళ్లి సక్రమంగా కట్టేసుకోకుంటే గోశాలలకు తరలిస్తామని హెచ్చరించారు.

అభివృద్ధికి అహర్నిషలు కృషి : ఎమ్మెల్యే

రేగొండ, ఆగస్టు 6: నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిషలు పాటుపడతానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరయ్యారు. 156 మంది లబ్ధిదారులకు రూ.39,31,500 చెక్కులను పంపిణీ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేస్తోందన్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా 3,500 ఇందిరమ్మ ఇళ్లను ఇస్తామన్నారు. పేదలకు అందుబాటులో ఉండే లా ఎంఆర్ఐ, సీటీ స్కాన్‌లను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేశానన్నారు.కోటంచ ఆలయాన్ని రాష్ట్రం గర్వించేలా అభివృద్ధి చేస్తామన్నారు. బాగిర్తిపేట నుండి కోటంచ వరకు డబుల్ రోడ్డు నిర్మాణం త్వరలోనే మొదలుపెడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భూపాపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గుంటోజు కిష్టయ్య, మండల ప్రత్యేకాధికారి శామ్యూల్, తహసీల్దార్ శ్వేతారావు, పీఏసీఎస్ చైర్మన్ విజ్ఞన్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సన్న, సీనియర్ నాయకులు కటంగూరి మనోహర్‌రెడ్డి, ఎడ్ల మల్లారెడ్డి, మోడెం ఉమేష్‌గౌడ్, మేకల భిక్షపతి, పున్నం రవి, ఏనుగు రవీందర్ రెడ్డి, నాంసాని రాంబాబు, మైస భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను కాపాడుకోవాలి

గణపురం : స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా నాటే ప్రతి మొక్కనూ సంరక్షించాలని ఎమ్మెల్యే గండ్ర సత్యానారాయణరావు అన్నారు. మంగళవారం మండలంలోని చెల్పూరు గ్రామ పంచాయతీలో స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమానికి జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణ ఆదిత్య, కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి హాజరయ్యారు. ఈసందర్భంగా గ్రామ పంచాయతీ ఆవరణలో, పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఎంపీడీవో భాస్కర్, పీఏసీఎస్ చైర్మన్ గండ్ర సత్యనారాయణ రెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ మల్హల్‌రావు, పంచాయతీ కార్యదర్శి హరిశ్చంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ కొత్త వెంకన్న, మాజీ వైస్ ఎంపీపీ అశోక్, చోటేమియా తదితరులు పాల్గొన్నారు.

కన్నయ్య మృతి కాంగ్రెస్‌కు తీరనిలోటు : సీతక్క



మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న సీతక్క

గోవిందరావుపేట, ఆగస్టు 6: మండలంలోని మొట్లగూడెం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కుర్సం కన్నయ్య అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమని, పార్టీకి తీరని లోటని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రి ధనసరి సీతక్క అన్నారు. మంగళ వారం ఆమె కన్నయ్య మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రి వెంట కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, నాయకులు ఉన్నారు.

కేజీబీవీని తనిఖీ చేసిన డీఈవో

కాటారం, ఆగస్టు 6: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని డీఈవో రాజేందర్ మంగళవారం తనిఖీ చేశారు. సెక్టోరియల్ అధికారి రాజగోపాల్‌తో కలిసి సందర్శించారు. వంటగదిలో కూరగాయలు, ఆహారపదార్థాలను పరిశీలించారు. మెనూ ప్రకా రం భోజనం అందిస్తున్నారా.. లేదా? అని తెలుసుకున్నారు. రికార్డులను, విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు పట్టికలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, విద్య అందించాలని ఆదేశించారు. ఆయన వెంట కేజీబీవీ ప్రత్యేకాధికారి చల్ల సునీత తదతరులు ఉన్నారు.

ప్రమాద సూచికలు ఏర్పాటు చేసిన పోలీసులు

తాడ్వాయి, ఆగస్టు 6: మండల కేంద్రం నుంచి ఏటూరునాగారం, మేడారం, కాటాపూర్, పస్రా వైపు రహదారుల వెంట ఉన్న మలుపుల వద్ద ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. అనంతరం స్థానిక ఆశ్రమ ఉన్నత బాలికల పాఠశాలలో 55 మంది విద్యార్థినులకు జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను ఎస్సై పంపిణీ చేశారు. సైబర్ నేరాలు, మొబైల్‌ఫోన్ వినియోగంపై అవగాహన కల్పించారు.

అభివృద్ధి పనులు పరిశీలించిన జిల్లా ఇన్‌చార్జ్ అధికారి

గోవిందరావుపేట, ఆగస్టు 6: మండలంలోని చల్వాయి గ్రామంలో పల్లెప్రకృతివనం, క్రీడాప్రాంగణం, వైకుంఠదామం తదితర అభివృద్ధి పనులను మంగళవారం జిల్లా ఇన్‌చార్జి అధికారి ఎస్.కృష్ణఆదిత్య పరిశీలించారు. కలెక్టర్ టీఎస్.దివాకరతో కలిసి పర్యటించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 9 వరకు చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. పరిసరాల్లో పిచ్చిమొక్కలను తొలగించి ఆకర్షణీయమనైన మొక్కలను నాటాలన్నారు. వైకుంఠధామంలోని ఇంకుడుగుంతలోకి వర్షపు నీరుపోయేలా భూమిని స్లోప్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

దేవాదుల పంపింగ్ పునఃప్రారంభం

కన్నాయిగూడెం, ఆగస్టు 6: ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని గుట్టల గంగారం వద్ద ఉన్న జె.చొక్కారావు దేవాదుల ఎత్తి పోతల ప్రాజెక్టు నుంచి పంపింగ్ మంగళవారం పునఃప్రారంభమైంది. ఫేజ్- 3లోని ఒక మోటారును ఆన్ చేసి భీంఘనపూర్ రిజార్వాయర్‌కు 292 క్యూసెక్కుల నీటిని ఎత్తి పోస్తున్నారు. ఇన్‌టేకవెల్ వద్ద 81.10 మీటర్ల నీటిమట్టం నమోదు అయింది. అలాగే తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్క సాగర్ బ్యారేజీలోకి వరద ప్రవాహం కొనసాగుతోంది. మంగళవారం ఉదయం వరకు తగ్గుతూ వచ్చిన గోదావరి మధాహ్నం నుంచి నిలకడగా కొనసాగుతోంది. ఎగువ నుంచి 4,87,310 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో ప్రాజెక్టులోని మొత్తం 59 గేట్లు ఎత్తి 4,87,018 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. బ్యారేజీ వద్ద 78.80 మీటర్ల నీటిమట్టం నమోదైంది.

ఇసుక క్వారీల తనిఖీ

మంగపేట, ఆగస్టు 6: మండలంలోని చుంచుపల్లి, వాడగూడెం మూడు ఇసుక క్వారీలను మంగపేట తహసీల్దార్ బైరి వీరస్వామి ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది మంగళవారం సాయంత్రం తనిఖీ చేశారు. ఇసుకను ట్రాక్టర్లలో నింపుతున్న తీరును పరిశీలించారు. బూర్గంపహాడ్- ఏటూరునాగారం ప్రధాన రహదారిపై లారీలను నిలుపొద్దని, దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంద'దని ఇసుక క్వారీ రెజ్లింగ్ కాంట్రాక్టర్లకు, నిర్వాకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే లోడింగ్ చేయాలన్నారు. ఆయన వెంట నాయబ్ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావు, ఆర్‌ఐలు శ్రీనివాస్, ఏసుపాదం, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

కాటారం, ఆగస్టు 6: మండలంలోని పలు జీపీల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు బాలింతలు, కిషోర బాలికలు, మహిళలతో కలిసి ర్యాలీలు చేపట్టారు. సీడీపీవో రాధిక, సూపర్‌వైజర్ వీణ, ఏడబ్ల్యూటీలు సులోచన, పుష్ప, సునీత, హైమవతి, శ్రీలత, షాహేదాబేగం, కృష్ణవేణి, శ్రీలత, సువర్ణ, మంజుల, వెంకటలక్ష్మి, సుజాత, జయలక్ష్మి, త్రివేణి, వసుమతి, అమ్మక్క, అనసూయ, ప్రేమలత, విమల, అమృతరాణి, శ్యామల, కృష్ణవేణి, శ్రీలత, సులోచన, రేణుక, రజిత, స్వప్న, సత్యవతి, శ్రీవాణి, నజీమా, ఏఎన్ఎంలు, ఆయాలు పాల్గొన్నారు.

● వాజేడు : తల్లి పాల వారోత్సవాలను మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించారు. మండలంలోని జగన్నాథపురం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో వెంకటాపురం ప్రాజెక్టు సీడీపీవో ముత్తమ్మ పాల్గొన్నారు. గర్భిణీలు, బాలింతలు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అంజమ్మ, చంద్రకళ, బీసీ విజేందర్, టీచర్లు కవిత, శారద, విజయ, లక్ష్మి, సరస్వతి పాల్గొన్నారు.

వసతి గృహాలు మంజూరు చేయాలి

టేకుమట్ల, ఆగస్టు 6: మండలంలో విద్యార్థులకు వసతి గృహాలు మంజూరు చేయాలని విముక్తి చిరుత కక్షి (వీసీకే) ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి అంబాల అనిల్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆ పార్టీ నాయకులు సందిర్శంచి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అనిల్ మాట్లాడుతూ టేకుమట్ల నూతన మండలంగా ఏర్పాడి తొమ్మిదేళ్లు పూర్తికావస్తున్నా ఇప్పటి వరకు ఏ ఒక్క వసతి గృహం కూడా మంజూరు చేయలేదన్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి విద్యార్థులు బస్సుల్లో ప్రయాణించి టేకుమట్ల పాఠశాలలకు వస్తున్నారని, ఇక్కడ వసతి గృహాలు ఏర్పాటు చేయడం వల్ల వారికి వ్యయప్రయాస తప్పడం లేదని అన్నారు. ఆయన వెంట ఆ పార్టీ యూత్ విభాగం భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు మచ్చ శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

ఏటూరునాగారం, ఆగస్టు 6 : రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఏటూరునాగారం మండల కేంద్రానికి చెందిన క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ మేరకు కోచ్ పర్వతాల కుమారస్వామి తెలిపారు. జాకారం గురుకుల పాఠశాలలో ఈనెల 4న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో అర్జున్, రామ్ చరణ్ ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. వీరు రంగారెడ్డి జిల్లాలోని సరూర్ నగర్ స్టేడియంలో ఈనెల 7న జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారని తెలిపారు.

రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్టు

వెంకటాపురం(నూగూరు), ఆగస్టు 6: మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు ఎదిర గుట్టల వద్ద ఆర్‌అండ్‌బీ రహదారిపై భారీ చెట్టు మంగళవారం అడ్డంగా కూలింది. దీంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్లతోపాటు మండలకేంద్రానికి రాకపోకలు నిలిచిపోయాయి. ఈవిషయం తెలుసుకున్న పోలీసులు జేసీబీ సహాయంతో రోడ్డుకు అడ్డంగా పడిపోయిన చెట్టును తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

పోస్టల్ పథకాలపై అవగాహన కల్పించాలి

ఏటూరునాగారం, ఆగస్టు 6 : పోస్టల్ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని తపాలా శాఖ ములుగు జిల్లా ఇన్‌స్పెక్టర్ దయానంద్ అన్నారు. మండల కేంద్రలోని పోస్టాఫీసులో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి కుటుంబం తప్పకుండా ఇన్సూరెన్స్ కలిగి ఉండేలా అవగాహన పెంచాలన్నారు. ఆడపిల్లల భవిషత్తు కోసం ప్రవేశపెట్టిన సుకన్య పథకాన్ని సద్వినియోగం చేసుకొనేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ పోస్ట్ మాస్టర్లు మెయిల్ ఓవర్సీర్లు, బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రామప్ప ఆలయంలో స్వచ్ఛదనం-పచ్చదనం

వెంకటాపూర్(రామప్ప), ఆగస్టు 6: మండలంలోని పాలంపేట గ్రామంలో గల యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం పరిసరాల్లో మంగళవారం అటవీశాఖ అధికారులు, సిబ్బంది స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పరిసరాల్లో ఉన్న చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను తొలగించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో ములుగు ఎఫ్ఆర్‌వో డోలి శంకర్, డీఆర్‌వోలు మధుబాబు, యాకూబ్‌జాని, రవికుమార్, ఎఫ్ఎస్‌వో రవీందర్, ఎఫ్‌బీవోలు, విద్యార్థినీ విద్యార్థులు తదిత రులు పాల్గొన్నారు.